# అదృష్టం చేయి జారితే...

-శ్రీమతి ఉమాశశి

...అందుకోలేని నిర్భాగ్యు లంటారు. అటువంటి వాడే రాజేంద్ర. అతన్ని మొదటిసారి ఆంజనేయ స్వామి కోవెల దగ్గర కలుసుకున్నాను. ఆ గుడి దగ్గరే మా బస్‌స్టాప్. అక్కడ అన్ని కాలేజీల బస్సులు ఆగుతాయి. ఒక్క కాలేజీ బస్సులే కాకుండా టౌన్‌బస్, రుయ హాస్పిటల్‌కి రోగులను తీసుకుపోయి తీసుకు వచ్చే ఫ్రీ బస్, అప్పుడప్పుడు తిరుమల కొండకు వచ్చే పోయే బస్సులు కూడా ఆగుతూ ఉంటాయి. చాలా సందడిగా ఉంటుందా వీథి. ముఖ్యంగా తొమ్మిదీ—పదీ గంటల మధ్య మరీ రద్దీగా ఉంటుంది.

సంక్రాంతి సెలవుల తర్వాత కాలేజీ తెరిచిన రోజులు. కొత్తగా ఈ మధ్య, మామూలుగా బస్సులకోసం నించునే వాళ్ళే కాక, ఒక కుంటి కుర్రాడుకూడా బస్సుకోసం వస్తున్నాడు. మొదట్లో కొన్ని రోజులు నేను గమనించలేదు. అసలు ఆ బస్ స్టాప్‌కి అందరికన్న ముందు వచ్చేదాన్ని నేనే. ఆ తరవాతే మిగిలిన వారు మెల్లమెల్లగా చేరుకునేవారు. కానీ, ఈ అబ్బాయి నా కంటె ముందు వస్తున్నాడు. ఇతడిని నేను అంతగా గమనించలేదు మొదట్లో. కానీ అందరికన్నా ముందు వచ్చే నేను, నాకన్న ముందు వచ్చి




బస్సుకోసం నించునే ఈ అబ్బాయిని ఆ తర్వాత గమనిస్తూనే వచ్చాను. సుమారు ఇరవై ఏళ్ల వయస్సుంటుంది. పొడుగ్గా, తెల్లగా ఉంటాడు. చూడటానికి అందంగా ఉంటాడు. కానీ, పాపం ఒక కాలు అవిటి. రెండు కర్రల సహాయంతో నడుస్తాడు.

ఒక రోజు ... ఆంజనేయస్వామి గుడి ముందు నించున్నాను. లోపల దేవుడికి ఏదో సేవ జరుగుతూంది. గుడి గంట గణగణ మోగుతూంది. లోపలకు వెళ్లకపోయినా, వీథిలోంచే స్వామి విగ్రహం బాగా కనబడుతూంది. నేను అక్కడికి వచ్చి నించోగానే అతనికోసం చూశాను. మామూలుగా నాకన్న ముందే వచ్చే అతను అక్కడ లేడు. ఏమయి ఉంటాడు? ఒంట్లో బాగాలేదేమో? అతని గడియారం ఆగిపోయిందేమో? వచ్చేస్తాడు, కొంచెం అటు ఇటు—అను

కుంటూ గుడి లోపలకు చూశాను. దేవుడు రోజా కన్న అందంగా కన బడ్డాడు. ఎంతో బాగా అలంకరించారు లోపల ద్వారాన్ని, దేవుణ్ణి. గడియారం చూసుకున్నాను. తొమ్మిది ఇరవై. అందరి బస్సులు వచ్చాయి. అందరూ వెళ్లి పోయారు. నే నొక్కదాన్నే మిగిలాను. అతని బస్సుకూడా వచ్చే వేళయింది. ఏమయ్యా డతను? ఆలోచిస్తున్నాను. టక్ టక్ ... చప్పుడు. చెవులు రిక్కించి విన్నాను. అతనే. కోవెల పక్కనుండి లోంచి వస్తూంది ఆ చప్పుడు. మరో నిమిషానికి అతను వచ్చేశాడు. అమ్మయ్య! రాగానే నావైపు చూశాడు. చాలా అలిసి నట్టున్న ఆ కళ్ళు నన్ను చూసి పలక రింపుగా నవ్వాయి. నా పెదవుల మీదికి కూడా నాకు తెలియకుండానే మంద హాసం వచ్చింది. అతనే పలకరించాడు ముందు.

"ఈ రోజు కాస్త లేట్‌గా వచ్చాను కదూ, మేడమ్?"

ఆ కంఠస్వరంలోని ఆప్యాయతకు కరిగిపోయాను. "లేటేమిటి? మీ బస్ ఇంకా రాలేదుగా? సమయానికి వచ్చారు" అన్నాను సముదాయింపుగా.

"చాలా థాంక్స్, మేడమ్! మా చెల్లెలు వాళ్ల ఫ్రెండ్ ఇంటికి వెళ్లి నోట్స్ తెచ్చి పెట్టమంది. వెళ్లి వచ్చే లోగా టైమయిపోయింది." సమాధానం చెప్పుకున్నాడు.

"అలాగా? మీ చెల్లెలు చదువు కుంటోందా?"

"అవును, మేడమ్, బి. ఏ. మొదటి సంవత్సరం. నేను ఫైనలియర్." మొహా నికి పట్టిన చెమట తుడుచుకుంటూ గుడి గోడకు జార్లపడ్డాడు.

"ఈ రోజు బస్సులు ఆలస్యంగా వస్తున్నట్టున్నాయి. లోపల కెళ్లి అరుగు మీద కూర్చోకూడదూ? అలసట తగ్గు తుంది" అన్నాను.

"ఆలోగా బస్ వచ్చేస్తే?" అతని సంశయం.

"వస్తే ఏం? నే చెపుతాను."

"మీరు మా బస్ ఆపుతారు సరే. మీ బస్ ముందొచ్చి మీ రెళ్లిపోతే?"

నిజమే! నే వెళ్లిపోతే అతను లోప లున్నట్టు తెలియక డ్రైవర్ బస్ ఆప కుండానే వెళ్లిపోవచ్చు.

"పర్వాలేదు, మేడమ్! నాకు అల సటగా లేదు. ఒక వేళ ఇంతకుముందు ఉన్నా మీ పలకరింపుతో పోయింది." నవ్వా డతను. నేనూ నవ్వాను.

"మీ పేరు?"

"రాజేంద్ర."

"మంచి పేరు. రాజేంద్రకుమార్ భక్తులా?"

"ఊహుఁ. రాజేంద్రప్రసాద్ భక్తులం."

"అదుగో మీ బస్" అన్నాను.

బస్ వచ్చి అక్కడ ఆగేలోగా అతను అన్నాడు: "నన్ను 'మీరు' అనకండి, మేడమ్. మీకన్న చిన్న వాణ్ణి."

"ఓ. కె. రాజేంద్రా!"

రాజేంద్ర చాలా కలివిడి మనిషి. మా స్నేహం గట్టిపడుతూంది. ఇంచు మించు రోజూ రాజేంద్ర సాయంకాలం మా ఇంటికి వచ్చేవాడు. అమ్మ అతన్ని కొడుకులా చూసుకొనేది. "అమ్మా" అంటూ తిరుగుతున్న రాజేంద్రంటే మా అమ్మకు ఎనలేని అపేక్ష. "నిక్షేపం లాంటి కుర్రాడు. ఆ అవకరం లేకుండా పుట్టించకూడదూ ఆ దేవుడు!" అంటుండేది. అలా అన్నప్పుడల్లా అమ్మ కళ్లలో నీరు తిరగడం నేను గమనించక పోలేదు.

నాన్నగారికి తను రాసిన ఇంగ్లీషు పాఠాలకు సంబంధించిన వ్యాసాలు చూపుతూ ఉండేవాడు రాజేంద్ర.

"అబ్బ ఎన్ని తప్పులోయ్! ఇంకా బాగా ఇంప్రూవ్ చేసుకోవాలి" అంటూండే వారు నాన్న.

"అలాగేనండి" అంటూ తల ఊపే వాడు రాజేంద్ర. తమ్ముళ్లతో కలిసి ఆడుకుంటూండేవాడు. ఇంట్లో వాళ్ల మంతా రాజేంద్రమీద మమతలు పెట్టు కున్నాము. మమత పెంచుకోకుండా మనిషి జీవించలేడేమో?

రాజేంద్రకు కావలసిన పుస్తక మేదో మా లైబ్రరీలో దొరికితే అది ఇద్దామని వాళ్లింటి కెళ్లాను. అదే ప్రథమం నేను వాళ్లింటికి వెళ్లడం. ఒక నడివయసు ఆవిడ కనబడింది. రాజేంద్ర వాళ్ల అమ్మగారేమో? "ఏమండీ! రాజేంద్ర ఉన్నాడా?" అడిగాను.

"వాడా? వా డెక్కడుంటాడు! ఉద్ద బడుద్దాయి. కుంటికులాసం ఇంటికి మోసం. ఒక్కొక్క పని చెయ్యడానికి ఒక్కొక్క యుగం చేస్తాడు." సాగ దీసింది ఆవిడ.

నిర్ఘాంతపోయాను. ఎవ రీవిడ?

పెరటి గుమ్మంలోంచి టక్ టక్.

"వచ్చేశాను, పిన్నీ" అంటూ లోపలకు వస్తున్నాడు రాజేంద్ర. లోపల కడుగు పెడుతూనే నన్ను చూసి, "మీరా, మేడమ్! కూర్చోండి, మేడమ్. నించునే ఉన్నారేం?" అన్నాడు సంబ రంగా.

"ఎవరోయ్? అంత సంబర పడు తున్నావ్?"

"పిన్నీ, మేడమ్. మా మేడమ్." తడబడుతూ అన్నాడు.

దగ్గరగా వెళ్లి నవ్వుతూ, "రాజేంద్రా! మీ అమ్మగారేరి? పిలవ కూడదూ?" అన్నాను.

"అమ్మా? !" మొహం పాలిపోయిం దతనిది.

నాలిక కరుచుకున్నాను. ఎంత పూలిష్‌గా అడిగాను! ఆవిడ లేదేమో? అప్పటిక్కాని నా మనసుకు తట్టలేదు.

"అయ్యో సంబడం! అమ్మ కూడానా ఈ మొహానికి! పుట్టినప్పుడే తల్లిని పొగొట్టుకున్నాడు, ముదనష్టపు వాడు. కుంటి వెధవ!" రాజేంద్ర పిన్ని గొంతు ఖంగు మంది.

రెండు చెవులు గట్టిగా మూసు కున్నాడు రాజేంద్ర.

"ఛీ!" నా నోట్లోంచి అప్రయ త్నంగా వచ్చింది.

**మమత పెంచుకోకుండా మనిషి జీవించలేడేమో? మమతే లోపిస్తే మనిషి బ్రతుక్కి విలువ లేకుండా పోతుంది. ఉన్నతమైన మానవునిలో అనుమానం, ఈర్ష్య, గర్వం గూడు కట్టుకోవడం పతనానికి నాంది కావచ్చు. కుంటివాడైనంతమాత్రాన మనసు కుంటిది కాదు అతని మీద మమత పెంచుకొన్న మనిషికి అతను దూరమైతే?**

సవతి తల్లి కాబోలు ... కావచ్చు. కాబట్టే సవతి బిడ్డని హింసించే హక్కు ఉండవచ్చు. కానీ, ఆ అవిటి బిడ్డను అన్నమాటా—"కుంటి, కుంటి" అంటూంటే నాకేదో కడుపులో దేవినట్లయింది. ఇందుకే కాబోలు రాజేంద్ర ఎప్పుడూ ఇంటి సంగతులు అడిగితే అంటీ అంటనట్లు సమాధానం చెప్పి మాట తప్పించే వాడు. సవతి తల్లి గురించే చెప్పలేదు.

"ఒరే, రాజా! నేను నీళ్లు పోసుకో వాలి. నీళ్లు చేదిపెట్టు నూతిలోంచి" అంటూ ఓ పడుచు పిల్ల షోగ్గా తల ఊపుతూ వచ్చింది. చెల్లి కాబోలు. నాకు కోపం నసాళానికి అంటింది.

"రాజేంద్రా! నాన్నగారు నిన్ను పిలుచుకు రమ్మన్నారు. నాతో రా" అన్నాను వెళ్లిపోతూ.

"మేడమ్! మా చెల్లికి నీళ్లు తోడి వచ్చేస్తాను."

వెనక్కి తిరిగాను.

"నువ్వు నూతిలోంచి నీళ్లు తోడ గలవా? ఆ అమ్మాయి తోడుకోలేదూ?" అడిగాను.

"ఏమిటండీ, అంత కుంటూ ఏమిటి అన్నయ్య? రోజూ తోడటం లేదూ?" ఆ అమ్మాయి అంది.

నిజమే! రాజేంద్ర అంత కుంటివాడా ఏమిటి? రెండు కాళ్లూ లేవుగా! ఒక కాలు ఉందిగా! మరో కాలు లేకపోతేనేం? రెండు చేతు లున్నాయి. ఏ పని చెప్పినా చేయగల మనో నిబ్బరం ఉంది.

"సరే, పద" అన్నాను పెరటివైపు వెడుతూ.

"మీ రెందుకు, మేడమ్! ఇక్కడ కూర్చోండి. అయిదు నిమిషాల్లో వచ్చే స్తాను."

"కాదు, రాజేంద్రా, నే నొచ్చి నీళ్ళు తోడుతాను. నువ్వలా పక్కన నించో అక్కడ" అన్నాను.

"మీరా, మేడమ్! వద్దు...వద్దు..." కంగారుగా అన్నా డతను. ఒక కర్ర కదిలింది బరువుగా.

"అయ్యో! వీడు చేసే పనులన్నీ ఇంక తమరే చేస్తారు కాబోలు రోజా!" అంటూ మూతి మూడు వంకర్లు తిప్పింది రాజేంద్ర పిన్ని.

కిసుక్కున హేళనగా నవ్వింది అతని చెల్లెలు.

తన్నుకొచ్చే కోపాన్ని గొంతులోనే నొక్కిపట్టి అన్నాను:

"అయ్యో రామ! నే నెందుకు రోజూ చేస్తానండి? నే నేం అతనికి జన్మనిచ్చిన తల్లినా? తోడ బుట్టిన చెల్లినా? అతని సంగతి రోజూ ఆలోచించడానికి అతని కెవరున్నారు? తల్లా, తండ్రా..." ఉద్రేకం తన్నుకొచ్చింది నాకు.

"హవ్వ ... హవ్వ! తండ్రి లేడూ? నీకెంత నోరే?" ఆవిడ బుగ్గలు నొక్కు కుంది.

"నిజమే, సీతా, నిజం ... వాడికి తండ్రెక్కడున్నాడు? ఉంటే వాణ్ణిలా ఇంటెడు చాకిరీ చేయిస్తాడా?" అంటూ కాస్త వయసు మళ్లినాయన వచ్చాడు. అంటూనే నా దగ్గరి కొచ్చి, "నిజం,

(మిగతా 41వ పేజీలో)

(35 వ పేజీ తరువాయి)

తల్లి ... సరిగా గమనించావు. నేను తండ్రినే ... ఉన్నా లేనట్లే" అన్నా డాయన.

"క్షమించండి. అనాలని అనలేదు. రాజేంద్ర కష్టం చూస్తుంటే ..." నసిగాను.

"అవునమ్మా. చూస్తున్నావుగా దాని పాటి దాటి? వాడి ఖర్మ!"

"మేడమ్! పదండి వెడదాం, మా గొడవలు మామూలే." అభిమానంతో అన్నాడు రాజేంద్ర.

దారిలో తన గొడవంతా, ఎప్పుడూ చెప్పని రాజేంద్ర నాకు చెప్పుకుంటూ వచ్చాడు. చిన్నతనంలోనే అతనికి పోలియో వచ్చింది. ఒక కాలు అవిటిదై పోయింది. ఆ తర్వాత రెండేళ్లకి తల్లి పోయింది. తండ్రి—పిల్లవాడి పోషణకంటూ మళ్లీ పెళ్లి చేసుకోవడం, సవతి తల్లి బాధలు—అన్నీ మామూలే.

"సరే సరే. ఇవన్నీ మనసులో పెట్టు కోకు. నీకు చదువుకోవడానికి మా ఇంట్లో కుదరక పోతే మా ఇంటి కొచ్చెయ్. తమ్ముళ్లతోబాటు చదువు కుందు గాని."

"మేడమ్ ... నిజంగానా! ?"

"ఏమిటది? నిజంగానే అంటు న్నాను."

ఈ ఏర్పాట్లకు మా ఇంట్లో కూడా అందరూ సంతోషించారు. రోజూ వచ్చి చదువుకునే ఈ ఏర్పాటుకు రాజేంద్ర చాలా ఆనందించినట్లు అతని కంట్లో నీరు, నీటి వెనుక మెరుపు తెలిసింది.

పది రోజులు సరిగా వచ్చాడు రాజేంద్ర. ఆ తరవాత రావడం మానే శాడు. కారణం అడిగితే —

"మేడమ్! పరాయి వాళ్లింటికి వెళ్ల ద్దంది మా పిన్ని" అన్నాడు. అతని కళ్లు ఎక్కడో చూస్తున్నాయి. శని వారం కావడం వల్ల ఆంజనేయస్వామి కోవెలలో కోలాహలం ఎక్కువగా ఉంది. రాజేంద్ర ఇచ్చిన సమాధానానికి నిర్ఘాంతపోయాను.

"రాజేంద్రా? మేం పరాయివాళ్లమా!" నా హృదయం నీరవుతూంది.

"నాకు కారు, మేడమ్! మా పిన్నికి పరాయి వాళ్లే."

"ఏమిటది? ఎందు కి పరాయివు మీ పిన్నికి? నే నొచ్చి చెబుతాను." ఉద్రేకంలో గట్టిగానే అన్నాను.

"వద్దు, మేడమ్! వద్దు. నా మూలంగా మీ అవమానం పొందడం నేను సహించలేను. మీకు చెడ్డపేరు."

"రాజేంద్రా! పిచ్చిగా మాట్లాడకు. ఇంక పబ్లిక్ పరీక్షలు నెల రోజులున్నాయి. పిచ్చి పిచ్చి ఆలోచనలతో మనసు పాడు చేసుకోకు. రోజూ వచ్చి మా ఇంట్లో చదువుకో. నీకు చెడ్డపేరేం రాదులే. ఇంకో విషయం. నీకు వచ్చిన విషయం, నీకు మంచిదని తోచిన పని చేయడానికి వెనుతీయ కూడదు. ధైర్యం ఉండాలి, రాజేంద్రా! స్వార్థపరులకి తలవంచ డంలో ధీరత్వం లేదు. వింటున్నావా?" నా ఆవేశం చూసి నవ్వాడు రాజేంద్ర.

"అలాగే, మేడమ్! బాగా చదువు కుంటాను. రోజూ మీ ఇంటికి వస్తాను" అన్నాడు.

నాతో రాజేంద్ర స్నేహ మయినప్పటి నుంచీ నా సహోద్యోగులు చెవులు కొరు క్కోవడం మొదలు పెట్టనే పెట్టారు. అయినా నేను లెక్క పెట్టను.

మమతి నా ప్రాణ స్నేహితురాలు. అది అంటుంది: "ఎందుకే రాజేంద్రని ఫ్రెండ్, ఫ్రెండ్ అంటావు?"

"మరే మనమంటావు?" నిర్ఘాంత పోయి అడిగాను.

"తమ్ము డనలేవా?"

"తమ్ముడా? తమ్ముడెలా గవుతాడు?"

"తమ్ముడు లాంటి వాడేగా!"

"అవును. కానీ, తమ్ముడు కాడుగా! రాజేంద్ర. అంతే. స్నేహితుడు."

"నీది ఉత్త పెడవాదం!"

"అది కాదు, మమతీ! స్నేహితు డంటే తప్పేమిటి?"

"నీ కసలు ఏ తప్పు లేదు. ఉత్త మొండి. మన ఆఫీసులో ఎంత చెత్తగా రాసుకుంటున్నారో తెలుసా?"

"చిత్రం, రాణీగారూ! తెలుసు."

"నీకంతా హాస్యం. ఈ సంగతి మీ బావ వింటే ఈ మేనెలలో కావలసిన నీ పెళ్లి అవుతుందా?" తీక్ష్ణంగా అడిగింది మమతి.

"అంటే? మా బావ అంత సంకుచిత మైన మనసు కలవాడనా నీ ఉద్దేశం?"

"అదికాదు, లలితా! నేనెందుకు చెబు తున్నానో విను. మగవాళ్లంతా అంతే. మీ బావ మాత్రం దివినుండి దిగి వచ్చాడా? అనుమానం అనేది మగవారి సొత్తు."

నిర్ఘాంతపోయాను.

"మమతీ! ఒక అవిటి కుర్రవాడిని చేరదీసి, ఏ సహాయం చేయలేకపోయినా మాట సహాయం చెయ్యడందుకు మా బావ సందేహిస్తాడా? అయితే చూద్దాం. ఈ రోజే ప్రకాశానికి ఉత్తరం రాస్తాను. రాజేంద్రతో నా పరిచయాన్ని అపార్థం చేసుకుని నా సాన్ని హిత్యాన్ని తుంచేసుకునేంత తెలివితక్కువ తనం అతనిలో లేదని నా సంపూర్ణ విశ్వాసం. ఒక వేళ అతనే అలాంటి వాడయితే ... అయితే ... వదులుకోవ డానికి వెనుదీయను." ఆవేశంగా అన్నాను.

"లలితా, లలితా! నీ కెలా చెప్పాలి. మగవాడిలో అంత మంచితనం ఉండదు."

"ఇందులో అసలు నా మీద అను మాన పడటానికి ఆస్కారమేది, మమతీ! నేను చేస్తున్నది మంచి పని. నువ్వే చెప్పు—రాజేంద్ర... రాజేంద్రని చూస్తే నీ మనసు కరగదూ?"

నా ప్రశ్నకి అది కదిలిపోయింది. మమతి కళ్లల్లో నీళ్లు.

"నాకు తెలుసు, మమతీ, నీ హృదయం కఠినం కాదు. రాజేంద్రని వాళ్ల పిన్ని, పెళ్లి ఎంత బాధపెడుతున్నారో నీకు తెలియదూ? అతను చాలా బాధలు పడుతూ కష్టపడి చదువుకుంటున్నాడు. దగ్గర తీసుకుని ఓదార్చడానికి కన్నతల్లి లేదు. ఆప్యాయతతో మాట్లాడే తోబుట్టువులు లేరు. సహృదయంతో చేరదీసే స్నేహితులు లేరు. కన్నతల్లికి దూర మైన బ్రతుకు ... భగవాన్ ..." ఆగాను.

"వద్దు, వద్దు, చెప్పకు, లలితా... వినలేను. మరింకేం చెప్పకు. నీ ఇష్టం వచ్చినట్లు చేయి. నీది చల్లని మనసు. నీ స్నేహం నా క్కావాలి. రాజేంద్రకీ కావాలి. రాజేంద్ర నీ కెంతో నాకూ అంతే" అంది కళ్లు తుడుచుకుంటూ.

కొంతసేపయ్యాక అది వెళ్లిపోయింది.

అన్ని సంగతులతో బావకు ఆనేకే పెద్ద ఉత్తరం వ్రాసి పోస్ట్ చేశాను. సమాధానంకోసం చకోరిలా వేచి చూడ సాగాను. ఒక్క వారం గడిచినా ఉత్త రానికి సమాధానం రాకపోవడంతో మనసు పరిపరివిధాల పోయింది.

పది రోజుల తర్వాత బావ దగ్గరి నుంచి ఉత్తరం వచ్చింది. అతి చిన్న ఉత్తరం అది. అయితేనేం?

"... నీ ఉత్తరం అందింది. క్యాంప్‌కి వెళ్లినందువల్ల నీ ఉత్తరానికి వెంటనే సమాధానం ఇవ్వలేకపోయాను. మరేం అనుకోకు. నువ్వు చెప్పిన రాజేంద్ర ... నీ కెంత అన్నుడో నాకూ అంతే. అతన్ని చేరదీసి చల్లని మాటలు చెప్పే నువ్వంటే నా కెంత గర్వంగా ఉందో తెలుసా? మనిషి మనుగడ కో అర్థం ఉందని నిరూపించావు. జీవితంలో ఒక మంచి పని చెయ్యాలి. రాజేంద్రలో ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ (న్యూనతా భావం) పోగొట్టు. రాజేంద్రని మనిషిగా నిలబెట్టే నీ బాధ్యత నేనూ పంచుకుంటున్నాను. ఎప్పుడూ పంచు కుంటాను. ఇంతకన్న ఏం చెప్పను—చేసి చూపించాలిగాని?

మరి ఉండనా?

నీ ప్రకాశ్."



ఆ ఉత్తరం చదివాక నేను భూమి మీద నిల్చున్నానా? గాలిలో తేలాను.


బావ ట్రెయినింగ్‌కి వెళ్లవలసి వచ్చి నందువల్ల మేనెలలో కావలసిన పెళ్లి ఆగస్ట్‌కి వాయిదా పడింది. రాజేంద్ర

పరీక్షలన్నీ బాగా వ్రాశాడు అని చెప్పాడు నాతో. వేసవి సెలవుల మూలంగా ఇల్లంతా సందడిగా. మరో నెల వచ్చి వెళ్లినట్లే తెలిసేదా సందట్లో.

పరీక్ష ఫలితా లొచ్చే రోజులు.

"అక్కా! రాజేంద్ర ఫెయిలయ్యాడక్కా!" మా పెద్ద తమ్ముడు పేపరుతో సహా వచ్చి నన్ను నిద్ర లేపాడు. పిడుగు పడినట్లయింది నాకు. నిద్ర మత్తంతా వదిలిపోయింది. "ఏమిట్రా? సరిగా చూశావా?" పేపరు వాడి చేతిలోంచి లాక్కుని చూశాను. నిజమే. రాజేంద్ర నెంబరు ఏ క్లాసులోనూ లేదు. మనసంతా కెలికేసినట్లయింది. రాజేంద్ర ఇంటి కెళ్లాలి. అత నెలా ఉన్నాడో? మా తమ్ముణ్ణి వాళ్లింటికి పంపాను పిలుచుకు రమ్మని. కొంతసేపటికి మరో పిడుగులాంటి వార్త మోసుకొచ్చాడు తమ్ముడు. రాజేంద్ర కనిపించడం లేదట, ప్రొద్దుటి నుంచి. ఎక్కడికి వెళ్లి ఉంటాడు. ఇంటి దగ్గర లేడు. ఇక్కడికి రాలేదు. మరి? నా మనసు కీడు శంకిస్తోంది. మరెవరూ లేరు అతనికి. ఫెయిలయి నందువల్ల ఏ అఘాయిత్యమూ చేసుకోలేదుకదా? లోలోపలనుంచిఏడుపు ముంచుకొస్తోంది నాకు. నాన్న, తమ్ముళ్లు, రాజేంద్ర నాన్న — అందరూ తలో దిక్కుకూ వెళ్లారు వెతకడానికి. ఎక్కడా అతని జాడలేదు. ఆ రాత్రంతా శివరాత్రి. రాజేంద్ర నాన్న ఆ రాత్రంతా మాతోనే ఉండిపోయాడు. ఉండి ఉండి కన్నీళ్లు పెట్టుకుంటూ చెప్పాడు. ముందు రాత్రి చాలా పెద్ద గొడవ జరిగిందట. ఏదో తేబోయి జార విడిచేశాడట. వాళ్ల పిన్ని తిట్లవర్షం. "నేను వాణ్ణి దగ్గర తీసుకుని ఓదార్చాను. ఈ మధ్య వీడు మాటపడటం మానేశాడు. మాటకు మాట అంటున్నాడు. దానితో అది మరీ రెచ్చిపోతోంది. అక్కడికీ వాడిని వెనకేసు కొచ్చాను. మా ఇద్దరిని పట్టుకు దులిపింది మా ఆవిడ. మాటల మధ్యలో మీ పేరు వచ్చింది. మేడమ్ పేరెత్తావంటే నీ రక్తం కళ్లచూస్తానని వాడు దాని మీది కెళ్లాడు. సర్దేసరికి తాతలు దిగి వచ్చారు. మేడమ్‌కి నా మూలంగా చెడ్డపేరొస్తోందంటే రాత్రంతా ఏడ్చాడమ్మా ... ఆ అలసటలో నాకు కాస్త కునుకు పట్టింది. పొద్దున్న చూస్తే లేడు" అంటూ కన్నీళ్లు పెట్టుకున్నాడు.

# మార్గదర్శులు




## ముగ్గురి రోదసీ యాత్ర

తొలిసారిగా ముగ్గురు చోదకులతో నడిచిన రోదసీ యాత్రలో వ్లాడిమిర్ కొమరోవ్, కాన్‌స్టాంటెన్ ఫియొక్టిసోవ్, బోరిస్ యెగరోవులు పాల్గొన్నారు. 1964 అక్టోబరు 12 న కోస్మాడ్—1 లో వారు వెళ్లారు.

రోదసిలో 24 గంటల 17 నిమిషాలు వా రున్నారు. శాస్త్రీయ ప్రయోగాలు చేస్తుండగా యెగరోవ్ వారి శారీరక మానసిక స్థితిని పరిశీలిస్తూ వచ్చాడు.

ఆఫ్రికా దాటిన కొద్ది సేపటికే వారి ఉష్ణ కవచం 10 వేల డిగ్రీల ఫారెన్‌హీట్ కనబరచింది.

ఆ తర్వాత మంచు తెరలు తిరుగుతున్న చల్లటి ప్రపంచంలోకి వారు దిగారు.

అచేతనంగా అయిపోయాము మేము. రాజేంద్రా, రాజేంద్రా! నా మనసు ఎలా తట్టుకుంటూంది? ఈ బాధ నా కర్థం కావటం లేదు. అంతా వైరాగ్యం కమ్ముకు వచ్చింది. ఎన్ని రకాలుగా అతనికి ధైర్యం చెప్పేదాన్ని! అంతా వ్యర్థమయింది. ఎంత చెప్పినా అతనిలో ఉన్న పిరికి గుణాన్ని, చేతకాని తనాన్ని తీసి వేయలేకపోయాను. నా ప్రయత్నం అంతా బూడిదలో పోసిన పన్నీరయింది. నా వ్యధ ఇంతింత నరానంత. ఎంత దురదృష్టవంతుడు రాజేంద్ర! దగ్గరలో ఉన్న చల్లని నీడను వదులుకున్నాడు. ఎక్కడున్నాడో? ఎన్ని బాధలు పడుతున్నాడో? అస లేమయ్యాడో? నా కన్నుల్లో నీరు ఇంకడం లేదు.

రోజులు, వారాలు, నెలలు గడిచాయి. ఎప్పటికైనా రాజేంద్ర కనిపిస్తాడా? ఎందు కిలా చేశాడు రాజేంద్ర? అన్న ప్రశ్న చిక్కు ప్రశ్నగా నిలిచిపోయింది.

ఏ దీనమైన కళ్లు చూసినా నాకు రాజేంద్ర గుర్తుకు వస్తాడు. రాజేంద్రని మరవలేను, మరవలేను. సంవత్సరాలు దొర్లిపోయినా, ఇంక అతను కనబడడు అనే అనిపిస్తోంది! ★